సి. పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయ
ప్రవేశ సంఖ్య ..................
తేది ..................
కడప - 516 004.

# కొడుకు రాకపోయ్యే

అసలైన ధర్మప్రచారంలో ఎదురులేని ఆదిశంకరాచార్యలా - నిర్మలాకాశంలో చంద్రుడు పయనిస్తున్నాడు. పిండారబోసినట్టున్న వెన్నెలలో చిన్నపిల్లలు రాజు రాజు గుమ్మడి పండాట ఆడుకుంటున్నారు. అరుగుల మీద ఆడవాళ్ళ ముచ్చట్లు యధావిధిగా కొనసాగుతున్నాయి.

తన ఇంటి అరుగుమీదో పక్కన కాళ్ళకు చేతులు చుట్టి, గవద మోకాళ్ళకానించి గంభీరమూర్తిలా కూర్చున్నాడు ముత్యాలు. దృష్టి కుమ్మరి సారె మీదుంది. దివ్యదృష్టి మరెక్కడో ఉంది. ఆడవాళ్ళ ముచ్చట్లు అతన్ని చేరడం లేదు.

"పొద్దుట్నుంచి కుండల్జేసి అలసిపోయినట్టున్నాడు ముత్యాలన్న" అన్నది చిల్లరకొట్టు సీతమ్మ - ముత్యాలువైపు చూపులు మరలించి.

ప్రజాకోర్టులో భూస్వామి పాపారావు హత్య, మాజీ గ్రామాధికారి ఎడమకాలు, కుడిచెయ్యి గొడ్డళ్ళ దాడికి గురికావడం గుసగుసలుగా ప్రారంభమైనాయి. ఆడవాళ్ళ చర్చనీయాంశం మారిందనడానికి నిదర్శనం సీతమ్మ మాటలే.

"ఔను వదినా! పొద్దు పొడవకముందే మన్నుదెచ్చి నాన్పుకుంటడు. పొద్దుగూకేదాకా కుండల్జేస్తడు. కాయకష్టం జేస్కునే మా మొగోళ్ళకు గిప్పుడే జెరంత పుర్సతు దొరుకుద్ది" అంది ముత్యాలు భార్య రాజవ్వ. ఆమె గొంతులో ముందటి ఉత్సాహం లేదు. మాటల్లోని చలాకీతనం మాయమైంది.

"మీ మొగోళ్ళకేం మహారాజులు; కూచున్నచోట సంపాదించు కుంటరు" అనలేక పైమాటలన్నది.

"కష్టం జెయ్యంది కడుపులకు రాదు రాజవ్వొదినా! నా మొగుడు కష్టపడి పట్నంనుంచి సామాన్లు దేకపోతే దుకానం నడువది గదా!" సీతమ్మ గొంతు స్థాయి పెరిగింది.

"ఎంతైనా కష్టంల కష్టం వేరుంటది. దుకాండ్ల సామాన్లమ్ముతూ, రెక్కలు ఇరిగేటట్టు కాయకష్టం జేసుడూ ఒకటే ఐతదా?" కమ్మరి బలరాం భార్య లచ్చమ్మ రాజవ్వ పార్టీలో చేరిపోయింది, ముంగురులు సవరించుకుంటూ.

"పైసలు పెట్టుబడి పెట్టి భయపడుకుంట పంజెయ్యాలె. అందులో లాభమొస్తుందో నష్టమొస్తుందో తెల్వదాయె. నష్టమొస్తె దొంతిల నుండి అడగకుండ తప్పదీసినట్టైపాయె. చిప్ప చేతికొస్తుంది - తెల్సా?" టీచర్ భార్య విశాలాక్షి సమర్థించింది సీతమ్మను. వెన్నెల వెలుగు ఆనిడ రవ్వల ముక్కుపుడకను తళుక్కుమన్పించి, నుదుటి బొట్టులో చెమక్కు కలిపింది.

"అందరికంటే సర్కార్ నౌకరోళ్ళకే నయం. ఏ కష్టం లేకున్నా నెలనెలా రూపాయలు లెక్కపెట్టుకోవచ్చు." వ్యవసాయ కూలి దుర్గమ్మ నిట్టూర్చింది.

విశాలాక్షి మూతి మూడువంకర్లు తిరిగింది.

"సర్కార్ నౌకరేం బాగుండదు. రోజంతా పంజెయ్యాలె. ఏదన్నా అర్జంట్ పనుంటే సెలవు పెట్టాలె. సెలవు దొరికితే సరేసరి, లేకపోతే సచ్చినట్టు డ్యూటీజెయ్యాలె. బానిస బతుకు గదూ! కాయకష్టం జేస్కొని బతికిందే నయం." తన వాదన సరైనదే నన్నది-ఆవిడ ఆరాటం.

"ఏదోలే భగవంతుడు ప్రాణుల నెట్ల బతికియ్యాలెనో గట్లే బతికి సడు" అంటూ దుర్గమ్మ లేచింది - ఈరోజు కిక చాలిద్దామన్నట్టు. ముచ్చట్ల పర్వంలో గంట గడిచిందప్పటికే.

"మన సీతారాముల పల్లెనే కాదు, దునియా అంతా గంతే."సీతమ్మ గూడా లేచింది.

ముత్యాలు చూపులు సారె మీదనే ఉన్నాయి.

మట్టిని నమ్మిన తనకు ఈ సారె,చక్రమే అన్నం బెడుతున్నాయి. పొడి మట్టిలో నీళ్ళు గలిపి పిసకాలి, తొక్కాలి, గిలిగింతలు పెట్టాలి. తన చెమట బిందువులు రుచి చూడగానే పులకించిన మట్టి ముద్దలను సారె కెక్కించాలి. ఎలా మలిసే అలా ఆకారాలు రూపొందుతాయి. తన తండ్రీ, తాతలు నమ్ముకున్నది గూడా దీన్నే.

మట్టిని నమ్మిన మనిషి ధనవంతుడు కాకపోవచ్చు కాని దరిద్రు డెన్నడూ కాడు.

మరి తన కష్టాల్లో పాలుపంచుకునే వాడెవ్వడు? ఇంకెవడూ? తన కొడుకే.

ముత్యాలు కసలు పిల్లలే పుట్టరన్నారు. రాజవ్వ మొక్కని దేవత లేదు, చేయని వ్రతం లేదు. ఆశలన్నీ చల్లారాక ఓ రోజు కొమురెల్లి మల్లన్న గుట్ట కెళ్ళొచ్చారు. పది నెలల్లో పండంటి కొడుకు పుట్టాడు. అంతరంగం సంతోష సముద్రమైంది. ముత్యాలు, రాజవ్వ మురిపాల కంతులేదు. ఆ దేవుని పేరే పెట్టారు కొమురయ్య అని. సారె మీది చక్రంలా కాలం గిర్రున తిరిగింది.

"పట్నంబొయ్యి కాలేజీల చదువుకుంట నాయినా!" పదో తరగతి పాసయాక పట్టుబట్టాడు కొమురయ్య.

రాక్షస సంహారార్థం బాలరాముణ్ణి తన వెంట పంపమన్న విశ్వామిత్రుని మాటలు విన్న దశరథుడైపోయాడు ముత్యాలు.

"అబ్బో....నిన్ను జూడకుండే మా ప్రాణాలుంటాయా?........" అందామనుకుని మింగేశాడు.

"ఇంగ సదువు చాలు. కుండల్జెయ్య నేర్చుకో. సదివినోళ్ళకు సర్కారు నౌకర్లే దొరుకుతలేవుగదా!"

కొమురయ్య మొహం కొర్రాయిలాగైంది.

"ఊహూ! నేం జదువుత. బాగా చదువుకుంట. చదివించకుంటే చచ్చిపోతా!" మంకు పట్టుపట్టాడు.

"ఉన్నొక్క పోరడు సదూకుంటనంటే వద్దంటవెందుకయ్యా?" రాజవ్వ సపోర్టు చేసింది-విధిలేక.

"చదూకున్న తెలివి వేరే ఉంటుంది ముత్యాలూ!" టీచర్ నారాయణ సముదాయించాడు.

"కొమురయ్య చాలా చురుకైనవాడు. పదో తరగతిల ఫస్ట్క్లాసుల పాసాయె. ఇంకో రెండేండ్లు గట్లే పాసైతే డాక్టరు కోర్సుల సీటు దొరుకుద్ది."

సీతారాముని పల్లెలో వైద్యుడనేవాడు లేడు. ఏ రోగమొచ్చినా పట్నం పరుగెత్తాలి, లేదా ప్రాణాలు వదలాలి.

నల్లని మేఘం మధ్య తెల్లని మెరుపులా - వెంటనే సదరు ముత్యాలు బుర్రలో ఆశాకిరణం మెరిసింది.

రెక్కలు ముక్కలైనా సరే....అప్పులు చేసైనా సరే....కొమురయ్యను చదివించాలె. నా లెక్క వాడు గూడా సగం బట్ట కట్టుకొని సన్నాసోలె బతకొద్దు. వాడో మంచి పంజెయ్యాలె....నిర్ణయం అమలై

పోయింది. కొమురయ్య పట్నం పెళ్ళేప్పుడు కన్నకడుపుల్లో కడలి తరంగాలెగసి పడ్డాయి.

''ఏందయ్యా, ఇంకా గట్లే చూస్తున్నవూ?" ముత్యాలు ముందుకొచ్చి నిల్చుంది రాజవ్వ.

నెత్తికి రుమాలు, మోకాళ్ళవరకు ధోతి, ముడతలు పడబోతున్న శరీరం, లోతుకుపోయిన కళ్ళు, చిరిగిన బనీనులోంచి తొంగి చూస్తున్న ఛాతీ - భర్త అవతారం కొత్తగా కనబడింది.

"ప్చ్....! మన కొమురయ్య ఎక్కడున్నడో.... ఏం జేస్తున్నడో?" గొణిగాడు ముత్యాలు.

రాజవ్వ ముఖం మసిబారిన కుండలాగైంది. విషాదరేఖలు దోబోచులాడాయా ముఖమ్మీద.

''మన కొమురయ్య గదూ? పట్నం బొయ్యి రెండేండ్లు దాటి పాయె!'' అంది ఆకాశం వైపు చూస్తూ.

చందమామను మబ్బు కమ్మేస్తుంది - లంచగొండి నాయకుణ్ణి ధనదాహం కమ్మేసినట్టు. వెన్నెల బూడిదరంగు పూసుకుంటుంది.

''అంతకుముందు ఎండకాలంల గిట్లొచ్చి గట్లవొయ్యిండు. సదూకునే పిల్లలు ఎండకాలంల రెండునెలలు ఇంటిదగ్గరుంటే మనోడు రెండురోజులు గూడ లేకపాయె!" ఇంట్లోకెళ్తున్న ముత్యాలు గుండె గుబగుబలాడింది.

నిజమే....ఏమైందో?!

''సదూకునేటోళ్ళకు ఎండకాలమంతా తాతీలే (సెలవులే) గదరా? గిప్పుడే ఎందుకు వోతున్నవ్?'' అడిగింది రాజవ్వ - కొమురయ్య తిరిగి పట్నం వెళ్ళేందుకు తయారౌతుంటే.

''ఎండకాలం సెలవులల్ల బాగా సధూకోవాల్నే! గట్లైతెనే డాక్టర్ కోర్సుల సీటు దొరుకుద్ది." కొమురయ్య సమాధానం కొండంత తృప్తి నిచ్చిందప్పుడు.

ఇప్పుడదే తల్లిహృదయం గిలగిల్లాడిపోతుంది. చెదరిన గుండెల్ని చేతబట్టుకుని కొడుకుకోసం కళ్ళల్లో వత్తులేసుకుని ఎదిరి చూస్తున్నారు. రోజూ కొడుకు గురించే ముచ్చటించుకుంటారు. ఒకరి కంటినీరు ఒకరు తుడుచుకుంటూ ఓదార్చుకుంటారు. కొమురయ్య గురించి ఎవ్వరినడిగినా తెలీదంటున్నారు.

....మల్లా ఎండకాలమొచ్చె. పట్నంల సదూకునే పిల్లలొచ్చిరి, శానా రోజులుండిరి. వానకాలం రాంగనే పోయిరి. కొమురయ్య రాకనేపాయె.... మెతుకు నోట్లో కెళ్ళలేదు ముత్యాలుకు. అన్నం పళ్ళెం పక్కకు జరిపి పక్కకు పడుకున్నాడు.

....తెల్లవారితే రాఖీల పున్నమి. పోయిన రాఖీల పున్నమికి గూడా రాలేదు కొమురయ్య. ఇప్పుడెక్కడున్నడో? మా ఇంటాయనకేమో పట్నం సంగతులేమీ తెల్వయాయె. ఏం జెయ్యాలె దేముడా! నువ్వే దిక్కు.... రాజవ్వ గూడా వెళ్ళి పడుకుంది - గిన్నెలు సర్దేసి. కడుపులో పేగులు కలకలమన్నాయి.

ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు. మనసంతా కొడుకు మీదనే. తెల్లవారే ముందు కలత నిద్ర. కలతనిద్రలో వెలవెలబోతున్న కొము రయ్య రూపం కనిపించింది.

"మూడేండ్ల నుండి కాలం గాకపాయె. బాయిల్లల నీళ్ళెండుక పాయె. నీళ్ళెక్కడ్నుంచి దెస్తున్నావ్ ముత్యాలూ?"

మట్టి తడుపుతున్న ముత్యాలు నడిగాడు ఇంటిముందున్న కమ్మరి ఖలదాం. గానుగలో మొద్దులా నోట్లో వేపపుల్లాడుతుంది.

"ఎట్లనన్న తిప్పలపడాలె. కావడి దీస్కపొయ్యి ఊరవతల జంగ మయ్య బాయిల నుంచి దెచ్చిన. ఇంకా మొకమే కడుగనట్టుందీ, కొలిమి కాడికి వోవా?"

"ఇయ్యాల పండుగ గదా! గింత పొద్దుగాల్ల కొలిమి దగ్గరికివోను. పూజ్జేసి, జంజెమేసుకుని రెండు జాములకు కొలిమి ముట్టిస్తా. గీ నీళ్ళ కోసం ఏంజెయ్యాల్నో మనసున వత్తలేదు" అన్నాడు బలరాం- అరుగు మీదో పక్క కూచుంటూ.

చెంబు పట్టుకెళ్ళి తిరిగొస్తున్న చిల్లరకొట్టు వెంకటేశమట్టే వచ్చాడు. ఖాళీ ముంతనో వక్కనుంచి అరుగు చివర కూచున్నాడు.

మట్టి తడపడం పూర్తైంది.

"దేవుడు పగ పట్టిండేమో! ఎండకాలం ఎండలు చంపుతున్న యాయె. వానాకాలం వానలు రాకపాయె. ఇంగ నీళ్ళెక్కడునుంచొస్తయి. పాపం బెరిగిపోయింది." కసాపిసా మట్టిని తొక్కుతూ అన్నాడు ముత్యాలు?

తెల్లగుడ్డమీద పసుపూ కుంకుమ కలిపిన నీళ్ళు కుమ్మరించినట్టు ఆకాశంలో తూర్పువైపున కాషాయ వర్ణమైపోతుంది.

"పాపం బెరుగదా మరి!" వెంకటేశ మందుకున్నాడు. "ఊర్లల్ల అన్నల భయమాయె, పట్నంల దొంగల భయమాయె. ముంగట చెరువు, వెనక బాయి అన్నట్టు ఎటు మాట్లాడినా కోపమేనాయె."

"నిజమే వెంకటేశమన్నా." గోడ కొరిగాడు బలరాం. "తెల్లందాకా ఇండ్లల్లకు అన్నలొచ్చిరి. అన్నం బెట్టుమ్రని. అన్నం వండి పెట్టకపోతే అన్నలు గొట్టిరి. పెడితే పోలీసులొచ్చి పట్టుకపోయిరి."

టీచర్ నారాయణ చేరుకున్నాడు ఖాళీ ముంతతో. "పొద్దుగాల్లనే మీటింగు వెట్టిండ్రా? పోలీసోల్లొస్తరు జాగ్రత్తా!" నవ్వుతూ సిగరెట్ పొగ స్టైలుగా వదిలాడు.

"రావయ్యా పంతులూ,రా! కూకో. ఇయ్యాల బడిలేదుగదా,కూకో!" ముత్యాలు పురమాయించాడు. అతని కాళ్ళ కదలిక భరతనాట్యంలా కన్పించింది నారాయణకు.

తూర్పు తలుపులు తెరుచుకుని నింగి వాకిట్లో అడుగిడిన బాల భాస్కరుని లేత కిరణాలు ముత్యాలు ఒంటిమీది చెమటబిందువుల్ని ముత్యాలుగా మార్చేస్తున్నాయి.

ఊళ్ళల్లో మీటింగులు పెట్టవద్దనే పోలీసుల చాటింపు బుర్రల్లో మెదిలింది. ముఖాలు ముడుచుకుపోతున్నాయి.

ఊరంతా భయం గుప్పిట్లో ఉందప్పటికే.

"గీ పేపర్ జూడుండ్రి" అంటూ డిగ్రీ విద్యార్థి నాగేందర్ - కుబుసం విడిచిన పాములా పరుగెత్తుకొచ్చాడు. వార్తాపత్రిక విప్పి చూపించాడు నారాయణకు.

"అరె.... గీ ఫోటోనా!?...." నారాయణ ముఖం పంచరంగుల బొమ్మైంది. అతనిలో ఆశ్చర్యం, ఆందోళన. పత్రికను కళ్ళతో చదివి మడిచి బలరాం చేతికిచ్చాడు. అర్జెంటు పనేదో గుర్తుకొచ్చినట్లు గబగబా వెళ్ళిపోయాడు.

బలరాం కంటబడింది ఫోటో.

"అరె.... ఈ ఫోటోనా?!.... గిది.... మరి చేతుల గదేందీ?.... ఫోటువ పేపర్లెందుకొచ్చింది?"ఆనందాశ్చర్యాలతో అతని మొహం వెలిగి పోయింది. మాటలు మాత్రం తడబడుతున్నాయి.

వెంకటేశం చేతిలో కొచ్చింది పత్రిక. తనలో తాను చదువుకుని, "అబ్బో....ఈ ఫోటో.... ఓహో....వారెవ్వా!" వెంకటేశం కనుబొమ్మలు ఎగిరిపడిన్నై.

"నువ్వు కూడా చూడు ముత్యాలూ!" అన్నాడు కళ్ళు పైకెత్తి.

కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి పత్రికనందుకున్నాడు ముత్యాలు.

''అరె.... గీ ఫోటువ మా కొమురయ్యదే!" అరిచాడు. అతని ముఖం అధికార పార్టీ అధ్యక్షునిలా వెలిగిందో క్షణం. "కానీ.... కాని చేతుల గదెందుకుంది? దీంట్లో ఏం రాశిండ్రు నాగేందరూ?''

అరుపు విని రాజవ్వ ఇంట్లోంచి బయటికొచ్చింది - చేతులు కొంగుకు తుడుకుంటూ.

"చూడే....మన కొమరయ్య ఫోటువ పేపర్లొచ్చింది!" చూపించాడు.

రాజవ్వ కళ్ళు మెరిసాయి. మొహమ్మీద పదహారు రంగులు పరుగులు తీశాయి. "దీంట్ల ఏం రాసుంది నాగేందరూ?" కళ్ళు ప్రశ్నార్థకాలైనాయి.

నాగేందర్ తుర్రుమన్నాడు.

"అరె గట్ల ఉరుకుడెందుకూ? నువ్వన్నా జెప్పు ఎంకటేశమన్నా!"

"అబ్బో.... గా సంగతి నాకెందుకూ?" చెంబు అందుకుని ఎవరో తరిమినట్టు - వెళ్ళిపోయాడు వెంకటేశు.

"నీ కేమన్నా దెల్వా బలరాం?" అడిగాడు ముత్యాలు - పత్రికను మరోసారి చూస్తూ.

"జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలినట్టు నీ వోలె నేను కూడా ఏలి ముద్రగాణ్ణైతి." నోరెల్లబెట్టాడు బలరాం. అతని మెదడులో నరాలు వణికిపోతున్నాయెందుకో. నాలుక తడారిపోతోంది.

"పోవాలె. ఇవ్వాల పండుగ గదా?.... జంజె మేసుకోవాలె-పోతా." తప్పుకున్నాడు.

ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తాననుకున్న అభ్యర్థి చిత్తుగా ఓడిపోయినట్టు బలరాం ముఖం వివర్ణమైంది.

చెట్ల కొమ్మల సందుల్లోంచి దూసుకొచ్చిన సూర్యకిరణాలు ముత్యాలు - రాజవ్వల మీద తచ్చాడుతున్నాయి, కళ్లముందు మసక తెరలు దిగుతున్నాయి. గుండెల్లో బండలు బద్దలైపోతున్నాయి.

ఒకరికొకరు ఆసరాగా ఇంట్లోకి నడిచారు.

"మనోడు ఎక్కడున్నడో గదా! వాని గతి ఎంత కున్నదో ఏమో! మనమేమో, పల్లెకొంపలపుట్టి పల్లెకొంపలల్లనే పెరిగి, సదువంటే భయపడ్తమి. ఏం చేస్తామయ్యా దేవుడా!"రాజవ్వనాభినుండి బయలుదేరిన ఆవేదన మూల్గు రూపంలో బయటపడుతుంది. గోడకు చేతులానించి మెల్లగా కూచుంది నేలమీద.

"ఉన్నొక్క మెతుకు గంజిలవోయినట్టు పుట్టక పుట్టక పుట్టిన కొడుకు మనకు కాకుండైపోయిండేమో! ఇంగ మనకు దక్కడేమో!" అనాలనుకున్నాడు ముత్యాలు. కాని, భార్య గుండె ముక్కలైపోతుందనే భయం - ఉప్పెనలా పొంగుకొచ్చే దుఃఖానికి అడ్డుకట్ట వేసింది. అలా అననీయలేదు.

కాని, ఆమెకు ధైర్యం చెప్పాల్సిన బాధ్యత తనకుంది. తాను నోరు తెరిస్తే ఆమె కేక పెడ్తుంది.

"ఏమైతదీ? ఏంగాదు. ఇయ్యాల్లగాకపోతే రేపు వాడే వస్తాడు!" మానవాతీతమైన శక్తి ఏదో గొంతు నులుముతూంటే ముత్యాలు నాలుక తడబడింది. నెత్తికి చేతులు బెట్టుక్కూచున్నాడు గోడకొరిగి.

"ఇంకేమొస్తదయ్యా? జెష్టక్క వాని నెత్తిమీది కొచ్చిందేమో! తప్పుతోవల నడిపించిందేమో! మనోడు ఇంగ మనదగ్గరికి రాడు. కుక్క చావు చస్తడయ్యా!" అనాలనిపించింది రాజవ్వకు, బోరున ఏడ్వాలనిపించింది. కాని, ముత్తయ్య బేజారైపోతాడు. తట్టుకోలేడు. కొమురయ్య చచ్చిపోతే తన భర్త బతకడం కల్ల. గుండె ఘోషను కడుపులో అదిమి పెట్టింది.

"మరి మనోని జాడ ఎట్ల దెల్వాలె? కాని, వాడెక్కడున్నా మనింటికే వస్తడు. నా తండ్రి నా కోసం తప్పక వస్తడు." ఏదో ఆవేశం పలికించింది.

"ఇంకేమొస్తడు....రాడు....వాడు రాడు!"గావుకేక వెయ్యాలనిపించింతదనికి.

జీవన సర్వస్వమైన కొడుకు....అల్లారుముద్దుగా పెంచినకొడుకు.... రెక్కలుముక్కలు జేసుకుని చదివించిన కొడుకు రాబందుల చేతుల్లో చిక్కినాడేమో!.... అసలీలోకంలో ఉన్నాడో లేడో....

తల్లిమనసు తపించిపోతుంది.

తండ్రి నరాలు తల్లడిల్లిపోతున్నాయి. పొద్దుగడుస్తూనే గుంది.

పేగులు పిండిన కన్నీరు ఒకరిదొకరికి కనబడకుండా-భూమాతకు నుదురు లానించి - దాచుకుంటున్నారు. వెక్కివెక్కి ఏడుస్తున్నారు.

గంటసేపు గడిచిందలాగే.

సముద్రపు నీరు తనలోకిరాగా తట్టుకోలేక కట్టలు తెంచుకున్న నదిలా - మాతృహృదయ కవాటాలు ఫటేల్‌మన్నాయి.

"కొడుకా....కొమురయ్యా!" పొత్తి కడుపులోంచి దూసుకొచ్చిన పిలుపు దిక్కుల నవరించింది. ఊరంతా మార్మోగింది. రాజవ్వ భూమ్మీది కొరిగిపోయింది.

గాలి స్థంబించి పోయింది. ఇరుగు పొరుగు ఆదరబాదరాగా పరుగెత్తుకొస్తున్నారటువైపు.

"ముత్యాలూ! రాజవ్వా!!" మంటల్లో చిక్కుకున్న మనిషిలా పరుగెత్తుకొచ్చాడు వెంకటేశం.

ముత్యాలు కళ్ళు దీనంగా చూచాయి.

"మీ కొడుకు....కొముర య్యా...." దమ్ము దీస్తున్నాడు వెంకటేశం.

గబుక్కున లేచికూచుంది రాజవ్వ.

"ఏమైంది....నా కొడుక్కేమైంది?" అడగాలనుకున్న ముత్యాలు నోరు తెరుచుకోకముందే—

"వస్తున్నాడు....బస్సుదిగి వస్తున్నాడు!" చెప్పేశాడు వెంకటేశం-రొప్పుతూ.

"అమ్మా....నాయినా....!" వచ్చేశాడు కొమురయ్య. అతని ముఖం నిండా చిరునవ్వు పులుముకుంది. పెదాలమీది నవ్వు ముత్యాల జల్లులా గన్పించింది తల్లిదండ్రులకు.

శివుని జటాజూటంలోంచి వెలువడిన గంగా ప్రవాహంలా వారిలో జీవశక్తి పరుగులు తీసింది.

ఎర్రగా, బొద్దుగా.... నూనూగు మీసాలు.... నునుదేరిన కండరాలు .... చంద్రకాంత మణుల్లా మెరిసే కళ్ళు .... తెల్లని డ్రెస్సులో కొమురయ్య.

"కొమురా! వచ్చినావా?" దిగ్గున లేచి గుండెలకు హత్తుకుంది రాజవ్వ. వర్షాకాలం, ఆకుల కొనలనుండి రాలిపడుతున్న జలకణాల్లా ఆమె కళ్ళనుండి నీటి బిందువులు బొటబొటా రాలిపడ్డాయి.

తండ్రి పాదాలకు నమస్కరించాడు కొమురయ్య. కొడుకును వాత్సల్య కౌగిలిలో బంధించింది పితృహృదయం.

"బాగున్నావా కొడుకా?".... ఇంకేం మాట్లాడాలో అర్థం కాలేదు

వీడేతొవ్వదొక్కిండు? ఏమైపోతడు? ఏం జేస్తున్నాడు? ఎందుకొచ్చిండో....ఎంతసేపుంటడో....పత్రిక ఫోటో కలవరపెట్టింది.

గూట్లోంచి పత్రిక తీసి కొమురయ్యకు చూపించి—

"దీంట్ల నీ ఫోటువ ఎందుకొచ్చిందిరా?" ఆపుకోలేక అడిగేశాడు.

కొమురయ్య ఏం చెబుతాడోనని రాజవ్వ ఊపిరి బిగపట్టింది.

"నేను విమాన సైనిక దళంల చేరిపోయిన నాయినా!" నవ్వు ముఖంతో హుషారుగా చెబుతున్నాడు కొమరయ్య "హైద్రాబాదు దిండి గల్లులనే ట్రైనింగైంది. నేను అందులో ఫస్టుగపాసైన. అందుకే నా ఫోటో పత్రికల వచ్చింది."

మురిసిపోతున్న కొమురయ్య మాటలు తల్లిదండ్రుల్లో ముసిరిన అనుమానాలను పారదోలలేదు. సందిగ్ధంగా వెంకటేశం వైపు చూచారు.

"కొమురయ్యకు గాలిమోటర్ల మిల్ట్రీల నౌకరి దొరికింది. తుపాకి పట్టుకుని ట్రైనింగ్ జేసెటప్పటి ఫోటోనే పేపరుకిచ్చింద్రడంట." వివరించాడు వెంకటేశం.

"మీ కొడుకదృష్టవంతుడు పెద్దయ్యా!" నాగేందర్ అమితోత్సాహంతో కొమురయ్య భుజమ్మీద చెయ్యేశాడు. "నేను గూడా మీ కొమురయ్యతోని ఇంటర్వ్యూకు పోయిన. కాని, సెలెక్టు కాలేదు."

"మరి గా సంగతి మాకెందుకు జెప్పలేదు బిడ్డా?" అడిగింది రాజవ్వ.

"మీరు పరేశానైతరని కొమురయ్యనే చెప్పవద్దన్నడు. ఈ సంగతి మీకు చెప్పొద్దని వెంకటేశమన్నకు నేనే చెప్పిన."

"నాగ్గూడా వాడే చెప్పిండు." నారాయణ.

"ఎందుకట్లా?" ముత్యాలుకావేశ మొచ్చింది.

"ఎట్లాంటే.... గదే....మీకు చెప్తె మీ కొడుకేమైపోతడోనని గుండె పగిలి చస్తరని చెప్పలేదు." అసలు సంగతి కొమురయ్యనే చెప్పేశాడు.

'దానికి నన్ను క్షమించరూ!' అన్నట్టు వుందతనివాలకం.

రాజవ్వ, ముత్యాలు ముఖాలు మతాబాల్లా వెలిగాయి. హిందూ సామ్రాజ్య పట్టాభిషిక్తుడౌతున్న వీరశివాజీని చూస్తున్న జిజియామాతైంది రాజవ్వ.

(జాగృతి 27-6-94 & 10-7-94)